శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు మాఘ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:43 సూర్యాస్తమయం - సా. 6:16 తిథి అష్టమి ఉ. 11:55 వరకు తరువాత నవమి సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం అనురాధ మ. 3:43 వరకు తరువాత జ్యేష్ఠ యోగం వృఘతా ఉ. 11:51 వరకు కరణం కౌలవ ఉ. 11:55 వరకు తైతుల రా. 12:41ం వరకు వర్జ్యం రా. 9:54 నుండి రా. 11:37 వరకు దుర్ముహూర్తం ఉ. 9:01 నుండి ఉ. 9:47 వరకు మ. 12:52 నుండి మ. 1:38 వరకు రాహుకాలం ఉ . 11:03 నుండి మ. 12:29 వరకు యమగండం మ. 3:23 నుండి సా. 4:49 వరకు గుళికాకాలం ఉ. 8:09 నుండి ఉ. 9:36 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:07 నుండి తె. 5:55 వరకు అమృత ఘడియలు లేదుజి అభిజిత్ ముహూర్తం మ. 12:06 నుండి మ. 12:52 వరకు

e-paper

# ఈ -కబురు


ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం




ఒంటరితనం భయంకరంగా ఉంటుంది
సమంత

సినీ కబుర్లు


శుక్రవారం | 21-2-2025 | హైదరాబాద్ | e-kaburu.com

# ఢిల్లీ నుంచి రిమోట్ కంట్రోల్ చేయలేం

## యూజీసీ కొత్త రూల్స్ పై డిప్యూటీ సీఎం భట్టి ఫైర్

విద్యా అంశం కేంద్ర ప్రభుత్వ గుత్తాధిపత్యం కాదు.. ఇది ఉమ్మడి జాబితాలోని అంశమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఉన్నత విద్య ఉమ్మడి జాబితాలో ఉన్నందున కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలతో సంప్రదింపులు జరపాలన్నారు. విద్యావ్యవస్థను ఢిల్లీ నుంచి రిమోట్ కంట్రోల్ చేయలేమని, రాష్ట్రాల్లోని ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా ఆయా రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా విధానాలు రూపొందించాలని డిమాండ్ చేశారు.

- విద్యా వ్యవస్థపై కేంద్రానికి గుత్తాధిపత్య హక్కు లేదు
- రాష్ట్రాల ప్రత్యేక పరిస్థితులకు అనుగుణంగా విధానాలు రూపొందించాలి
- యూజీసీ కొత్త మార్గదర్శకాలపై భట్టి విమర్శలు
- భవనాల ప్రారంభోత్సవాలకే పరిమితం అవుతాయా రాష్ట్రాలు?
- ఉన్నత విద్యలో ప్రవేశ పరీక్షలు వెనుకబడిన వర్గాలకు అవరోధం

**ఈ-కబురు,తిరువనంతపురం**

ఫిబ్రవరి 20 : ఇవాళ కేరళ రాజధాని తిరువనంతపురంలో ఏర్పాటు చేసిన ఉన్నత విద్య జాతీయ సదస్సులో భట్టి పాల్గొని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ కొత్త మార్గదర్శకాలు 'మీరు కచ్చితంగా బిల్లు చెల్లించాలి.. కానీ మీ ఫుడ్‌ను ఆర్డర్ చేయలేరు' అన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు. సరైన మార్గాన్ని ఎంచుకునే అవకాశం రాష్ట్రాలకు ఉందని చెప్పారు. సరైన నిర్ణయం తీసుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటామని హెచ్చరించారు. అలాగైతే ప్రారంభోత్సవాలకే పరిమితం యూజీసీ కొత్త మార్గదర్శకాలు అమలు జరిగితే రాష్ట్రాలు కేవలం భవనాల ప్రారంభోత్సవంలో రిబ్బన్ కటింగ్ వేడుకలకే పరిమితమవుతాయని భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణలో విద్యాశాఖకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, (మిగతా 2 వ పేజీలో)

# లింగమూర్తి హత్యపై తెలంగాణ ప్రభుత్వం సీరియస్

- మేడిగడ్డ కుంగుబాటు కేసు దాఖలు చేసిన రాజలింగమూర్తి హత్య
- కేసును సీబీసీఐడీకి అప్పగించాలని ప్రభుత్వ నిర్ణయం
- హత్యకు బీఆర్ఎస్ సంబంధం ఉందని ఆరోపణలు
- హత్యపై కుటుంబ సభ్యుల నిరసన - న్యాయం చేయాలని డిమాండ్
- నిందితులు పోలీసుల అదుపులో - భూ వివాదమే కారణమా?
- రాజలింగమూర్తిపై గతంలోనూ పలు కేసులు
- మున్సిపల్ కౌన్సిలర్‌గా గెలిచి, తర్వాత బీఆర్ఎస్ నుంచి బహిష్కరణ
- మంకీ క్యాప్‌లతో వచ్చి దాడి - కుటుంబ సభ్యుల వేరే ఆరోపణలు



**ఈ-కబురు, హైదరాబాద్/భూపాలపల్లి:**

ఫిబ్రవరి 20 : మేడిగడ్డ కుంగుబాటు వ్యవహారంపై కేసు వేసిన నాగవెల్లి రాజ లింగమూర్తి దారుణ హత్యకు గురికావడాన్ని తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా భావిస్తోంది. రాజకీయ ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలోఈ కేసు విచారణను సీబీసీఐడీకి అప్పగించాలని నిర్ణయించింది. మధ్యాహ్నం మంత్రి కోమటిరెడ్డి ఈ కేసుపై మీడియాతో మాట్లాడతారని సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడానికి బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని లింగమూర్తి కేసు వేశారు. అయితే.. రాజలింగమూర్తి బుధవారం సాయంత్రం దారుణ హత్యకు గురయ్యారు. ముసుగులో వచ్చిన కొందరు ఆయనపై కత్తులు, గొడళ్లతో దాడి చేశారు. స్థానికులు వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

### బీఆర్ఎస్ హస్తం ఉందంటూ..

తన భర్త హత్య వెనుక బీఆర్ఎస్ హస్తం ఉందని సరళ ఆరోపిస్తున్నారు. తన భర్త హత్యకు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ సర్పంచి బుర్ర చంద్రయ్య, వార్డు మాజీ కౌన్సిలర్ కొత్త హరిబాబు కారణమని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె కుటుంబ సభ్యులతో కలిసి పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో జాతీయ రహదారిపై బుధవారం రాత్రి బైఠాయించారు. ఇక.. మేడిగడ్డ అవినీతి వ్యవహారంపై పోరాటం చేస్తున్నందుకే ఆయన్ని హత్య చేశారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. (మిగతా 2 వ పేజీలో)

## కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి..
# ఏపీ జలదోపిడీని అడ్డుకోవాలి

- లదోపిడీపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించాలి - హరీశ్‌రావు
- ఏపీకి నీరు తరలింపును అడ్డుకోవాలని బీఆర్ఎస్ డిమాండ్



2

## ప్రాజెక్టులతో నీళ్లు రాలేదు కానీ..
# వాళ్ల జేబులు నిండాయి



- పాలమూరు రంగారెడ్డితో ఏకరానికి కూడా నీరు రాలేదు
- కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం
- టెలిమెట్రిక్ ఏర్పాటు చేయలేకపోయిన బీఆర్ఎస్
- జీవో 203 తో ఏపీకి సహకరించిన మాజీ పాలకులు
- ప్రాజెక్టుల కోసం అధిక వడ్డీ రుణాలు తెచ్చిన బీఆర్ఎస్
- కాళేశ్వరం డిజైన్ తప్పేనా? ఎన్డీఎస్ఏ తేల్చిన అంశం
- పాలమూరు, ఎస్ఎల్బీసీ పనులు పూర్తి చేస్తాం
- రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

కేసీఆర్ ప్రభుత్వం హయాంలో చేపట్టిన ప్రాజెక్టులతో నీళ్లు రాలేదు కానీ.. వాళ్ల జేబులు నిండాయని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్ హయాంలో లక్ష కోట్లు ఖర్చు పెట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు వారి పాలనా కాలంలోనే కూలిపోయిందని...పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు కింద ఒక్క ఎకరం ఆయకట్టు రాలేదని ఉత్తమ్ ఆరోపించారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో బీఆర్ఎస్ పాలకులు పూర్తి వైఫల్యం చెందారని, రాష్ట్రానికి రావాల్సిన నది జలాల వాట కోసం కేంద్రంతో పోరాడకుండా తెలంగాణకు అన్యాయం చేశారని ఉత్తమ్ ధ్వజమెత్తారు.

**ఈ-కబురు, హైదరాబాద్**

ఫిబ్రవరి 20 : గత పాలకుల అసమర్థత కారణంగా తెలంగాణకు కృష్ణా జలాల కేటాయింపులు 299 టీఎంసీలు ఉంటే కేవలం 180 టీఎంసీలు మాత్రమే వాడగలిగారని తెలిపారు. పాలమూరు రంగా రెడ్డి, ఎస్ఎల్బీసీ ప్రాజెక్టులను పూర్తి చేయలేదన్నారు. ఏపీ పునర్విభజన చట్టంలో సాగునీటి కేటాయింపుల్లో తెలంగాణకు జరిగిన అన్యాయన్ని సరి చేయలేదని విమర్శించారు. కేసీఆర్, హరీష్ రావు పలు మార్లు జరిగిన సమావేశాల్లో తెలంగాణకు అన్యాయం జరిగేలా వ్యవహరించారని, (మిగతా 2 వ పేజీలో)



# ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు

- పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- సేవాలాల్ మహారాజ్ బోధనలు ఆదర్శప్రాయం
- బంజారా ధార్మిక వ్యాప్తి మహాసంఘ్ ఆధ్వర్యంలో భోగ్ బండారి హెూమం
- ధర్మబద్ధంగా నడుచుకోవడం, ప్రకృతి సంరక్షణపై సేవాలాల్ మహారాజ్ ఉద్బోధన
- నిరాడంబర జీవనం, శాఖాహారం, మహిళల గౌరవంపై మహారాజ్ మార్గదర్శనం

**ఈ-కబురు,సైఫాబాద్**

ఫిబ్రవరి 20 : ఈ రోజు గిరిజనుల ఆరాధ్య దైవం అయిన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా.. సైఫాబాద్‌లోని రవీంద్ర భారతిలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ జయంతి వేడుకలకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన తన ట్విట్టర్ ఖాతాలో ఇలా రాసుకొచ్చారు. "శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో ఈ రోజు నేను పాల్గొన్నాను. ఇందులో భాగంగా బంజారా ధార్మిక వ్యాప్తి మహాసంఘ్' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భోగ్ బండారి హెూమంలో పాల్గొని ప్రజలందరి శ్రేయస్సును కాంక్షించాను. గిరిజన జాతిని చైతన్య పరిచేందుకు (మిగతా 2 వ పేజీలో)



## తెలంగాణకు అన్యాయం చేసిన
# మొట్టమొదటి ద్రోహి ఆయనే..

బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

బడ్జెట్‌లో రూ.1.08 లక్షల కోట్లు కేటాయించిన కేంద్రం

2



## బంగ్లాదేశ్‌పై ఐదు వికెట్ల ప్రదర్శన..

షమీ ఖాతాలో ప్రపంచ రికార్డు

ఆట



## భారత్‌లోకి టెస్లా ఎంట్రీ..

వయా బెర్లిన్ రూట్

బిజినెస్

# మహా కుంభాభిషేక సంప్రోక్షణకు రండి..

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మహా కుంభాభిషేకానికి ఆహ్వానించిన దేవాదాయ శాఖ

- ఫిబ్రవరి 23న యాదగిరిగుట్టలో మహా కుంభాభిషేక ప్రతిష్ఠ మహోత్సవం
- వానమామలై మఠాధిపతి రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో కార్యక్రమం
- 55 అడుగుల ఎత్తుతో 68 కిలోల బంగారు తాపడం పూర్తి
- రూ.70 కోట్ల వ్యయంతో స్వర్ణ గోపుర నిర్మాణం పూర్తి
- దేశంలోనే మొట్టమొదటి ఎత్తైన స్వర్ణ గోపురంగా రికార్డు

**ఈ-కబురు, హైదరాబాద్**

ఫిబ్రవరి 20 : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం బంగారు విమాన గోపురం మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవంలో పాల్గొనాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, దేవాదాయ శాఖ కార్యదర్శి శైలజా రామయ్యర్ లతో పాటు ఆలయ ఈవో, అర్చకులు, జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రిని కలిసి ఆహ్వాన పత్రికను అందించారు.కాగా, ఈ నెల 23న యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ దేవస్థానంలో బంగారు విమాన గోపురం మహా కుంభాభిషేక ప్రతిష్ఠమహోత్సవం



నిర్వహించనున్నారు. వానమామలై మఠం 31వ పీఠాధిపతి రామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ మహోత్సవం నిర్వహించనున్నారు. ఇప్పటికే గోపురానికి బంగారు తాపడం అమర్చే పనులు ఇటీవలే పూర్తి అయ్యాయి. ఇక దేశంలోనే మొట్టమొదటి ఎత్తైన స్వర్ణ గోపురంగా రికార్డుకెక్కింది. ఈ గోపురం 55 అడుగులతో, 68 కిలోల బంగారం గోపురానికి తాపడం కోసం వినియోగించారు. సుమారు రూ.70 కోట్ల వ్యయంతో స్వర్ణ తాపడం పనులు చేపట్టారు.



# ..వాళ్ల జేబులు నిండాయి

(మొదటి పేజీ తరువాయి)

పదేండ్ల పాటు అధికారంలో ఉండి.. టెలిమెట్రిక్ ఏర్పాటు చేయలేక పోయారని..ఏపీ జల దోపిడీకి సహకరించారని విమర్శించారు. తెలంగాణకు పదేండ్ల పాటు కృష్ణా జలాల్లో అన్యాయం జరిగేలా వారు నిర్ణయం తీసుకున్నారని...జీవో 203 తో ప్రతీ రోజు 3 టీఎంసీలు తరలించేలా జగన్ చేసిన ప్రయత్నాలకు సహకరించారని బీఆర్ఎస్ పాలకులపై ఉత్తమ్ మండిపడ్డారు. ఆఖరికి ఆపేక్స్ కౌన్సిల్ మీటింగ్ ను కూడా.. ఏపీకి సహకరించేలా వ్యవహరించారని, రాయలసీమ లిఫ్ట్ పనుల కోసం ఆపేక్స్ కౌన్సిల్ మీటింగ్ ను వాయిదా వేశారని ఆరోపించారు. జగన్ తో విందు వినోదాలు చేసుకొని.. తెలంగాణకు కేసీఆర్ తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. పదేండ్ల కాలంలో నీటి కేటాయింపులు సాధించలేదని, నీటి కేటాయింపుల పొరపాట్లను మేము వచ్చాకే సరి చేస్తున్నామని ఉత్తమ్ వెల్లడించారు.కృష్ణా జలాల కేటాయింపుల్లో తెలంగాణకు అన్యాయం జరగొద్దని తాజాగా జాతీయ నీటి పారుదల శాఖ మంత్రుల సదస్సులో కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ కు వివరించామని వెల్లడించారు. ప్రాజెక్టుల్లో కమీషన్ కోసం 12 శాతం వడ్డీకి బీఆర్ఎస్ పాలకులు రుణాలు తెచ్చారని..ప్రాజెక్టుల రుణాలను నెగోషియేట్ చేసి 7 శాతానికి తగ్గించామని ఉత్తమ్ తెలిపారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ రిపేర్లను కూడా మేమే ముందుకు తీసుకెళ్తున్నామన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ కూలితే.. స్వయంగా ఎన్డీఎస్ఏ రంగంలోకి దిగి విచారణ చేపట్టిందని, బేసిక్ విచారణలోనే.. ప్రాజెక్టు డిజైన్ తప్పు ఉందని ఎన్డీఎస్ఏ స్పష్టం చేసిందన్నారు. నీళ్లు నింపవద్దని స్వయంగా ఎన్డీఎస్ఏ లిఖిత పూర్వకంగా లేఖ రాసిందని గుర్తు చేశారు. ఎస్ఎల్బీసీ టన్నెల్ పనులను, పాలమూరు రంగారెడ్డి పనులను పూర్తి చేస్తామని ఉత్తమ్ స్పష్టం చేశారు.

# తెలంగాణకు అన్యాయం చేసిన ద్రోహి ఆయనే..

**ఈ-కబురు, హైదరాబాద్**



ఫిబ్రవరి 20 : కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందనడం పచ్చి అబద్ధం. ఈసారి కేంద్ర బడ్జెట్‌లో పన్నులు, పథకాల రూపంలో తెలంగాణకు రూ.1.08 లక్షల కోట్లు కేటాయించాం. కళ్లుండి చూడలేని, చెవులుండి వినలేని కబోధులు కాంగ్రెస్ నేతలు అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో మీడియాతో మాట్లాడారు. ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయలేక, వాటి నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి కేంద్రంపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ నడుస్తోందని అన్నారు. తెలంగాణలోని గ్రామాలు, పట్టణాల వారీగా కేంద్రం ఏం చేసిందో, రాష్ట్రం ఏం చేసిందో చర్చించడానికి సిద్ధమా? అని సవాల్ చేశారు. తెలంగాణకు కేంద్రం ఏమిచ్చిందో? ఎవరు అన్యాయం చేశారో బహిరంగ చర్చలో ప్రజలకు తెలిసేలా మాట్లాడుకుందామని అన్నారు. ప్రధాని హోదాకు గౌరవం ఇవ్వకుండా అవాకులు పేలడం సరికాదని సీరియస్ అయ్యారు. గత ఏడాదితో పోలిస్తే 10 శాతం నిధులు పెరిగాయని అన్నారు.

దేశానికి సంబందించిన బడ్జెట్‌లో ఒక రాష్ట్రం పేరు లేనంత మాత్రాన ఆ రాష్ట్రానికి నిధులివ్వలేదని సరికాదని అన్నారు. కృష్ణా జలాల వాటాలో తెలంగాణకు అన్యాయం చేసింది కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలే అని అన్నారు. ఏపీతో కుమ్మక్కై తెలంగాణకు అన్యాయం చేసిన మొట్టమొదటి ద్రోహీ కేసీఆర్ అని తెలిపారు. ప్రాజెక్టు కట్టకుండా జాప్యం చేసింది కూడా ఆ రెండు పార్టీలే అని.. ఈ రెండు పార్టీలు తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని మొదట వేలెత్తి చూపింది తామే అని చెప్పారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ చీకటి మిత్రులు.. కాళేశ్వరం, డ్రగ్స్ కేసు, ఫోన్ ట్యాపింగ్ కేసు, ఫార్ములా ఈ రేస్ కేసులు ఏమైపోయాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఢిల్లీకి పోయి కేసీఆర్ కాంప్రమైజ్ అయ్యారని.. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి బీజేపీని అడ్డుకోవాలని కాంగ్రెస్‌తో కేసీఆర్ లోపాయికారీ ఒప్పందం చేసుకున్నాడని అన్నారు.లోపాయికారీ ఒప్పందంలో భాగంగానే కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉండేందుకే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కేసీఆర్ అభ్యర్థులను నిలబెట్టలేదని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చి.. అందులో 10 శాతం ముస్లింలకు కేటాయిస్తే ఏం న్యాయం చేసినట్లు అని అడిగారు. దీనిపై సీఎం క్లారిటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కులగుణన తప్పుల తడక అని అన్నారు. 3.95 కోట్ల ఆధార్ కార్డులుంటే.. జనాభా 3.7 కోట్లు ఎట్లా ఉంటారని ప్రశ్నించారు. 6 గ్యారంటీలే ప్రధానాస్త్రాలుగా కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. మతపరమైన రిజర్వేషన్లకు మేం పూర్తిగా వ్యతిరేకమని స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి.. ఏపీ జలదోపిడీని అడ్డుకోవాలి

**ఈ-కబురు, హైదరాబాద్**

ఫిబ్రవరి 20 : ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి, ఆంధ్రప్రదేశ్ చేస్తున్న జల దోపిడీని అడ్డుకోవాలి అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. రేవంత్ సర్కారుకి చేతకాకపోతే మేము వస్తాం.. ఢిల్లీకి పోదాం. ధర్నా చేద్దాం.. పదండి అని హరీశ్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.రాష్ట్ర సాగు, తాగు నీటి ప్రయోజనాలకు తీవ్ర నష్టం జరుగుతుంటే రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. సోయి లేని ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ఎంత నష్టం జరుగుతుందో అర్థం అవుతోంది. నీళ్ల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నీళ్లు నములుతున్నారు. బీఆర్ఎస్ తెలంగాణ భూములకు నీరు పారిస్తే%ొ% కాంగ్రెస్ నీళ్లు నములుతోంది. సాగర్ కుడి కాల్వ నుంచి రోజూ పది వేల క్యూసెక్కులు మూడు నెలలుగా పోతున్నా పట్టించుకోవడం లేదు. తాత్కాలిక వాటా అయినా 512 టీఎంసీలకు మించి 657 టీఎంసీలు తీసుకుపోయింది. 25 రోజుల్లోనే 65 టీఎంసీల నీటిని తరలించారు. తెలంగాణ నీటి ప్రయోజనాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టవా? ప్రభుత్వ నిర్లక్ష్యం



తెలంగాణకు పెనుశాపంగా మారింది అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

### తెలంగాణ ఇప్పటికే నష్టపోయింది ఇప్పటికైనా కళ్లు తెరవాలి..

నాగార్జున సాగర్ కేంద్ర బలగాల చేతిలో ఉన్నప్పటికీ కేంద్రం అనుమతి లేకుండా ఏపీ ఇష్టారీతిన నీటిని తరలించుకుపోతోంది. కేంద్రాన్ని అడిగే ధైర్యం లేదు, చంద్రబాబును అడిగే దమ్ము లేదు. ప్రతిపక్షాలను బాగా విమర్శిస్తారు కానీ, కేంద్రాన్ని అడిగే పరిస్థితి లేదు. శ్రీశైలం, సాగర్ నీటిని తరలించుకుపోతుంటే కనీసం స్పందించడం లేదు. 1015 టీఎంసీల నీరు కృష్ణాలో ఈ ఏడాది వచ్చింది. ఏపీకి కేవలం 9 టీఎంసీల హక్కు మాత్రం ఉంది ఇవాళ కూడా ఏపీకి నీరు తరలిస్తూనే ఉన్నారు. 220 టీఎంసీలు మాత్రమే తెలంగాణ వాడుకుంది ఇంకా 123 టీఎంసీలు రావాలి. తెలంగాణ ఇప్పటికే నష్టపోయింది ఇప్పటికైనా కళ్లు తెరవాలి అని హరీశ్‌రావు సూచించారు.

### నీటి తరలింపు ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం..

యాసంగి పంట కింద ఎన్ని ఎకరాలకు నీరు ఇస్తారో ప్రభుత్వం ప్రకటనలు ఇచ్చింది. ఆరున్నర లక్షల ఎకరాల్లో రైతులు పంటలు ఏసుకున్నారు, సాగర్ ఎడమకాల్వకు ఇంకా నాలుగు తడులు కావాలి. హైదరాబాద్ సహా చాలా జిల్లాల తాగునీటి అవసరాలు ఉన్నాయి. ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడి ఏపీకి నీరు ఆపేలా చూడండి. కృష్ణా బోర్డు కార్యాలయం ముందు, దిల్లీలో ధర్నా చేద్దాం%ొ% మేమూ వస్తాం. సాగర్ కుడి కాల్వ, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు నుంచి నీరు వెళ్లకుండా అడ్డుకోవాలి. నీటి తరలింపు ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం. రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోంది కాబట్టే ఏపీ ఇష్టం వచ్చినట్లు నీటిని తరలించుకుపోతోంది అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

# ఢిల్లీ నుంచి రిమోట్ కంట్రోల్ చేయలేం

(మొదటి పేజీ తరువాయి)



రాష్ట్రవ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ నిర్మిస్తున్నట్లు చెప్పారు. విద్యా సంస్థల్లో ఉపాధ్యాయులను భర్తీ చేశామని, విద్యారంగంలో డిజిటల్ తెలంగాణకు ప్రోత్సాహం కల్పిస్తున్నట్లు చెప్పారు. యూనివర్సిటీలకు వీసీల నియామకం సెర్చ్ కమిటీల్లో రాష్ట్ర ప్రభుత్వ పాత్రను తొలగించడం, వీసీల అర్హత ప్రమాణాలను మార్చడం ఆందోళనకర అంశమన్నారు. యూజీ కోర్సుల్లో ప్రవేశ పరీక్ష తప్పనిసరి చేయడంతో వెనుకబడిన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతారని చెప్పారు.

# ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు

(మొదటి పేజీ తరువాయి)



జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు, పూజ్యనీయుడు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 286 జయంతి ఉత్సవాల సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు.ధర్మ బద్ధంగా నడుచుకోవడం, ఆధ్యాత్మిక జీవనశైలిని అనుసరించడం.. ప్రకృతిని, సహజ వనరులను కాపాడుకోవలసిన అవసరాన్ని సేవాలాల్ మహారాజ్ ఆచరించి చూపించారు. అదే సమయంలో బంజారాలపై జరిగే కుట్రలను తిప్పికొట్టేలా వారిని యోధులుగా తీర్చిదిద్దారు. నిరాడంబరమైన జీవనం, స్వచ్ఛతను అలవర్చుకోవడం, శాఖాహారాన్ని అలవాటు చేసుకోవడం, మహిళలను గౌరవించడం వంటి శ్రీ సంత్ సేవాలాల్ గారి ఎన్నో బోధనలు మనకు ఆదర్శం.” అని కిషన్ రెడ్డి తన ట్వీట్ లో రాసుకొచ్చారు.



# లింగమూర్తి హత్యపై తెలంగాణ ప్రభుత్వం సీరియస్

(మొదటి పేజీ తరువాయి)

చట్ట ప్రకారం విచారణ జరపాలని, నేరస్తులు ఎవరైనా వదిలిపెట్టొద్దని, స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పోలీసులను కోరారు. హత్యా రాజకీయాలు ఏమాత్రం మంచివి కావని అంటున్నారాయన. కుటుంబ సభ్యుల అనుమానాలు, రాజకీయ ఆరోపణల నేపథ్యంలో తాజాగా.. లింగమూర్తి కేసును ప్రభుత్వం సీబీసీఐడీకి అప్పగించాలనుకుంటోంది.

### పోలీసుల అదుపులో నిందితులు?

రాజా లింగమూర్తి హత్య కేసులో నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. భూ వివాదాల నేపథ్యంలో లింగమూర్తి స్నేహితుడే ఈ హత్యకు ప్లాన్ వేశాడని పోలీసులు ప్రాథమికంగా ఓ అంచనాకి వచ్చారు. సంజీవ్, హరిబాబు, కొమురయ్య, మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. మరికాసేపట్లో జిల్లా ఎస్పీ ఈ కేసు గురించి మీడియాకు వివరించే అవకాశం ఉంది.

### బీఆర్ఎస్‌తో అనుబంధం నుంచి..

రాజా లింగమూర్తికి గతంలో బీఆర్ఎస్‌తో మంచి అనుబంధం ఉంది. ఆయన భార్య మాజీ కౌన్సిలర్ నాగవెల్లి సరళ. ఆమె 2019లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో భూపాలపల్లి లోని 15వ వార్డు నుంచి బీఆర్ఎస్ తరఫున కౌన్సిలర్‌గా గెలుపొందారు. అయితే కొద్ది నెలల తర్వాత నాగవెల్లి సరళను పార్టీ నుంచి బహిష్కరించారు. ఆ జంట కొన్ని నెలలుగా పట్టణంలోని రెడ్డి కాలనీలో నివాసం ఉంటోంది.

### మంకీ క్యాపులతో వచ్చి..

బుధవారం తన స్వస్థలం జంగేడు శివారు ఫక్కీర్‌గడ్డలోని తన బంధువుల ఇంటికి వెళ్లి పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్దకు వచ్చాడు. అక్కడ టీ తాగి రెడ్డి ఇంటికి బయల్దేరారు. కాలనీలోని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఎదురుగా రోడ్డును దాటుతున్న క్రమంలో.. ఆటోలో మంకీ క్యాపులతో వచ్చిన కొందరు దాడికి దిగారు. మొఖం, పొట్ట భాగంలో కత్తులతో విచక్షణారహితంగా పొడవడంతో పేగులు బయటపడి ఆయన కుప్పకూలిపోయారు. అయితే.. జిల్లాకేంద్రంలోని ఓ భూ వివాదంలోనే ఈ హత్య జరిగినట్లు పోలీసులు చెబుతుండగా.. లింగమూర్తి కుటుంబ సభ్యుల వాదన మాత్రం మరోలా ఉంది.

### లింగమూర్తిపైనా పలు కేసులు

రాజలింగమూర్తి రెండు దశాబ్దాలుగా వరంగల్‌కు చెందిన ఓ ప్రముఖ న్యాయవాది ద్వారా భూ సమస్యలను పరిష్కరించేవారు. గతంలో రాజలింగమూర్తిపై పలు కేసులు కూడా నమోదయ్యాయి.

ఓపెన్‌కాస్ట్ గనుల తవ్వకాలతో పర్యావరణం దెబ్బతింటోందని సింగరేణిపై నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్‌లో ఆయన ఫిర్యాదు చేశారు కూడా. ఈ వివాదాల నేపథ్యంలోనే ఆయన హత్య జరిగి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.



# ‘హిమాలయాలకు వెళ్తున్నావా’


- ఏపీ డీప్యూటీ సీఎం పవన్‌తో మోడీ సరదా వ్యాఖ్య
- ఎన్డీయే నేతలతో ఉత్సాహంగా కనిపించిన ప్రధాని
- ఢిల్లీ సీఎం ప్రమాణ స్వీకారోత్సవంలో సరదా సన్నివేశం

**ఈ-కబురు,ఢిల్లీ**

ఫిబ్రవరి 20 : ఢిల్లీ నూతన ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా ప్రమాణ స్వీకారం చేశారు. గురువారం రాంలీలా మైదానం వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోడీతో పాటు ఎన్డీయే పార్టీల ముఖ్యమంత్రులు, నేతలు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా మోడీ అందరినీ పలకరిస్తూ ఉత్సాహంగా కనప డ్డారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడితో స్నేహపూర్వకంగా మాట్లాడారు. అలాగే మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిండేతో కాసేపు ఆత్మీయంగా మాట్లాడుతూ కనిపించారు. అయితే ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో చేసిన సరదా సంభాషణ ఇప్పుడు అందరి దృష్టిని ఆకట్టుకుంది. కాషాయ వస్త్రాలు ధరించి వచ్చిన పవన్‌ను చూసి.. ‘ఏంటీ.. హిమాలయాలకు ఏమైనా వెళ్తున్నావా?’ అంటూ మోడీ జోకులు వేశారు. ఈ విషయాన్ని పవన్ స్వయ ంగా మీడియాకు వెల్లడించారు. ‘ప్రధాని మోడీ నాతో ఎప్పుడూ సరదాగా జోక్స్ వేస్తుంటారు. ఈ రోజు నా దుస్తులు, ఆహార్యాన్ని చూసి.. అన్నీ వదిలి హిమాలయాలకు వెళ్లాలని ప్లాన్ చేస్తున్నావా? అని అడిగారు. నేను ఎక్కడికీ వెళ్లడం లేదు. ఇంకా చేయవలసిన పని చాలా ఉందని చెప్పినట్లు’అని పవన్ మీడియాకు వెల్లడించారు. కాగా, ప్రధాని నరేంద్ర మోడీ ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు మొదటి నుంచి ప్రత్యేకంగా చూస్తున్నారు. ఏపీ సీఎం చంద్రబాబుకు సమానంగా పవన్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు.

## బైడెన్.. ఎవరిని గెలిపించేందుకు
# భారత్‌కు డబ్బులిచ్చారు?

**ఈ-కబురు,వాషింగ్టన్**




ఫిబ్రవరి 20 : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి మాజీ అధ్యక్షుడు జో బైడెన్, భారత్‌పై సంచలన ఆరోపణలు చేశారు. భారత్‌లో ఓటింగ్ శాతం కోసం 21 మిలియన్ డాలర్లను అమెరికా ఎందుకు ఖర్చు చేయాలి? అని ప్రశ్నించారు. ఎవరినో గెలిపించేందుకే బైడెన్ ఇలా చేశారని ఆరోపించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్ తాజాగా మియామీలో ఓ సదస్సుల్లో పాల్గొన్నారు. ఈ సందర్భ ంగా ట్రంప్ మాట్లాడుతూ..‘భారత్‌లో ఓటింగ్ శాతం కోసం మనమెందుకు 21 మిలియన్ డాలర్లను ఖర్చు చేయాలి?. భారత్‌లో మరెవర్నో గెలిపించేందుకు వారు (బైడెన్ ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ) ప్రయత్నించినట్లు అర్థమవుతోంది. ఈ విషయాన్ని భారత ప్రభుత్వానికి తప్పనిసరిగా తెలియజేయాలి. ఎవరి కోసం బైడెన్ డబ్బులు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు.

భారత్‌లో జరిగే ఎన్నికల్లో ఓటర్ల సంఖ్యను పెంచేందుకు అందించే 21 మిలియన్ డాలర్ల ఫండ్‌ను ఇటీవల అమెరికా డోజ్ విభాగం రద్దు చేసిన సంగతి తెలిసిందే.

## ద్వారకాలో పరిశోధనలు..
# ప్రారంభించిన ఆర్కియలాజికల్ సర్వే టీమ్

**ఈ-కబురు,గుజరాత్**

ఫిబ్రవరి 20 : కృష్ణ కర్మ భూమిగా భావించే గుజరాత్‌లోని ద్వారక తీరంలో ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకి చెందిన ఐదుగురు సభ్యుల బృందం నీటి అడుగున అన్వేషణను నిర్వహించింది. గుజరాత్ తీరంలో సముద్రంలోకి దిగి 4,000 ఏళ్ల పురాతన నగర రహస్యాలను ఛేదించే లక్ష్యంతో ఈ పరిశోధన ప్రారంభించినట్టు సాంస్కృతిక మంత్రిత్వ శాఖ తెలిపింది. ఏఎస్ఐ అదనపు డైరెక్టర్ జనరల్, ప్రొఫెసర్ అలోక్ త్రిపాఠి నేతృత్వంలోని ఐదుగురు పురావస్తు శాస్త్రవేత్తల బృందం దీనిని షురూ చేసినట్టు వెల్లడించింది. నీటి అడుగున ఉన్న భారతదేశపు గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని రక్షించడానికి ఏఎస్ఐ చేస్తున్న ప్రయత్నాలలో ఈ ఆవిష్కరణ ఒక ముఖ్యమైన భాగమని పేర్కొంది.ద్వారక, ఓఖా తీరంలో ఉన్న బెట్ ద్వారక అనే ద్వీపం సమీపంలో చివరిసారిగా 2005, 2007లో పరిశోధన జరిగింది. ఈ నేపథ్యంలోనే తాజాగా ద్వారకలో సముద్రం కింద ఉన్న చరిత్ర కోసం అన్వేషణ తిరిగి ప్రారంభమైందని తెలిపింది. హిందూ పురాణాల ప్రకారం.. పురాతన ద్వారక నగరం అరేబియా సముద్రంలో మునిపోయినట్టుగా భావిస్తారు. దీనిని కృష్ణుడి కర్మభూమి లేదా ల్యాండ్ ఆఫ్ యాక్షన్ గా పరిగణిస్తారు. సముద్రం ముందుకు సాగడంతో సహజ కారణాల వల్ల గతంలోని ద్వారక అదృశ్యమైందని చరిత్ర కారులు చెబుతారు. ఈ నేపథ్యంలోనే దాని అవశేషాలను కనుగొనేందుకు పరిశోధనలు జరుపుతున్నారు.








# భారత్‌లో టెస్లా ఫ్యాక్టరీ ఏర్పాటు..

### మస్క్ నిర్ణయం అన్యాయమే : డొనాల్డ్ ట్రంప్

**ఈ-కబురు,వాషింగ్టన్**

ఫిబ్రవరి 20 : అమెరికాకు చెందిన ప్రముఖ ఎలక్ట్రికల్ వాహనాల తయారీ కంపెనీ టెస్లా భారత్ మార్కెట్‌లోకి ప్రవేశించేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. ఇటీవలే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. టెస్లా బాస్ ఎలాన్ మస్క్‌తో సమావేశమైన రోజుల వ్యవధిలోనే టెస్లా సంస్థ భారత్‌లో ఉద్యోగ నియామకాలు చేపట్టింది. దేశ రాజధాని ఢిల్లీ, ఆర్థిక రాజధాని ముంబై నగరాల్లో రెండు షోరూమ్‌లు ఏర్పాటు చేసేందుకు కూడా ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఈ నేపథ్యంలో భారత్‌లోకి టెస్లా ప్రవేశించడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా స్పందించారు. ఈ మేరకు మస్క్ నిర్ణయాన్ని ఆయన వ్యతిరేకిస్తూ.. ఇది అన్యాయమే అంటూ వ్యాఖ్యానించారు. కాగా, ఎలాన్ మస్క్‌తో కలిసి ట్రంప్ ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ.. ఈ ప్రపంచంలోని ప్రతీ దేశం తమను వాడుకోవాలని ప్రయత్నిస్తోందని వ్యాఖ్యానించారు. సుంకాలతో లబ్ధి పొందాలని చూస్తున్నారని తెలిపారు. ఇప్పుడు మస్క్ భారత్‌లో టెస్లా ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడానికి రెడీ అవుతున్నారని.. ఆయన వరకు అది మంచి విషయమే కావొచ్చన్నారు. కానీ, అమెరికా పరంగా చూస్తే మస్క్ నిర్ణయం చాలా అన్యాయమే అవుతుందని వ్యాఖ్యానించారు. మస్క్ ముందే ట్రంప్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఇక ఇదే ఇంటర్వ్యూలో గత వారం ప్రధాని మోదీతో భేటీ విషయాన్ని ట్రంప్ ప్రస్తావించారు. ఈ మీటింగ్‌లో విద్యుత్ కార్లపై అధిక పన్నుల విషయాన్ని మోదీ తన వద్ద ప్రస్తావించినట్లు ట్రంప్ చెప్పారు.



## పనామాలోని భారతీయులు సేఫ్..

**ఈ-కబురు,వాషింగ్టన్**

ఫిబ్రవరి 20 : ఇండియన్ ఎంబసీ ప్రకటన అమెరికా నుంచి బహిష్కరించిన భారతీయ అక్రమ వలసదారులను పనామాకు పంపించిన విషయం తెలిసిందే.అక్కడ ఓ హోటల్‌లో ఉన్న ఇండియన్స్ ఇబ్బం దులు పడుతు న్నారని పలు కథనాలు వెలు వడుతున్న నేపథ్యంలో పనామా, నికరాగ్వా, కోస్టా రికా దేశాల్లోని భారత రాయ బార కార్యా లయం స్పందించింది. పనా మాలో ఉన్న భారతీయులు సురక్షితంగా ఉన్నారని తెలి పింది. అన్ని సౌకర్యాలతో కూడిన హోటల్‌లోనే బసచేస్తున్నారని పేర్కొంది. ఈ మేరకు ఓ ప్రకటన విడు దల చేసింది. ‘భారతీయుల బృందం అమె రికా నుంచి పనామా చేరుకున్నట్లు అక్కడి అధికారులు మాకు తెలియజేశారు. ఇండి యన్స్‌కు కావాల్సిన అన్ని వసతులు హో టల్‌లో కల్పించారు. వారిని కలవడానికి రాయ బార కార్యాలయం అనుమతి తీసు కుంది. సేఫ్ గా ఇండియా పంపించడానికి పనా మా ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నాం’ అని తెలిపింది. అమెరికా నుంచి వివిధ దే శాలకు చెందిన 300 మంది వల సదా రులు పనామాకు చేరుకున్నారు.

# ‘మాకు అన్ని వర్గాల మద్దతు ఉంది’



- ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి ఉపాధ్యాయుల మద్దతు
- రేవంత్ సర్కార్ అన్ని వర్గాలను మోసం చేసిందని ఆరోపణ
- కాంగ్రెస్, బీఆర్ఎస్ నాటకాలు ఆడుతున్నాయని కిషన్ రెడ్డి విమర్శ
- వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ
- 23 మంది నామినేషన్లు, 19 మంది బరిలో ఉన్నారు
- ఈ నెల 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్
- ఓటింగ్ ముగింపులో క్యూ లైన్‌లో ఉన్నవారికి టోకెన్ నంబర్లు
- ఎన్నికల ఏర్పాట్లు కఠినంగా కొనసాగుతున్నాయి

**ఈ-కబురు,భువనగిరి**

ఫిబ్రవరి 20 : రాబోవు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి ఉపాధ్యాయులు అండగా ఉన్నారన్నారు కేంద్ర మంత్రి, తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి. కాంగ్రెస్ ప్రజలకిచ్చిన హామీలను విస్మరించిందని, అన్ని వర్గాలను రేవంత్ సర్కార్ మోసం చేసిందని కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ బీఆర్ఎస్‌లు నాటకాలు ఆడుతున్నాయన్న కిషన్ రెడ్డి.. ఆ రెండు పార్టీలకు ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అడిగే ధైర్యం లేదన్నారు. బీజేపీకి అన్ని వర్గాల మద్దతు ఉందని భువనగిరిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో స్పష్టం చేశారు.కాగా, వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మొత్తం 23 మంది అభ్యర్థులు నామినేషన్ వేయగా19 మంది చివరకు బరిలో ఉ న్నారు. ఈ నెల 3న ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాగా 10వ తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు.

**ఈ నెల 27న పోలింగ్**

ఈ నెల 27వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. సాయంత్రం ఓటింగ్ ముగిసే సమయంలో క్యూ లైన్‌లో ఉన్న వారికి టోకెన్ నంబర్లను ఇచ్చి, ఓటింగ్ వేసే ఏర్పాట్లు చేస్తున్నారు.







# వయసును అధిగమించేందుకు రాస్ మెడికల్ ఫిట్ నెస్ సెంటర్ సరికొత్త విప్లవం

- నగరవాసుల కోసం అందుబాటులో
- హెచ్‌బీఓటీ ఛాంబర్ ఏర్పాటు
- ఇప్పటికే 20 మందికి విజయవంతంగా చికిత్సలు

**ఈ-కబురు,హైదరాబాద్**

ఫిబ్రవరి 20 : నగరంలోని వైద్య చికిత్సలలో ఇదో సరికొత్త విప్లవం. నగరంలో ఇన్నాళ్లుగా అందుబాటులో లేని హైపర్‌బేరిక్ ఆక్సిజన్ థెరపీ (హెచ్‌బీఓటీ) సాయంతో 20 మందికి రాస్ మెడికల్ ఫిట్‌నెస్ సెంటర్ విజయవంతంగా చికిత్స అందించింది. హెచ్‌బీఓటీ అనేది ఒక నాన్ ఇన్వేజివ్ థెరపీ. ఇందులో ఆరోగ్యం కావాలనుకునేవారు ప్రెషరైజ్డ్ ఛాంబర్‌లో 100% స్వచ్ఛమైన ఆక్సిజన్ పీల్చుకుంటారు. దీనివల్ల శరీరం ఆక్సిజన్‌ను మరింత మెరుగ్గా స్వీకరిస్తుంది. ఈ ప్రక్రియ సెల్యులార్ మరమ్మతును వేగవంతం చేస్తుంది, యాంటీ ఏజింగ్ ప్రయోజనాలను ప్రోత్సహిస్తుంది. నాడీ, జీవక్రియ ఆరోగ్యానికి మద్దతు ఇస్తుంది, మంటలను తగ్గిస్తుంది, రోగనిరోధక శక్తిని పెంచుతుంది.. ఇలా మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఈ చికిత్సను ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా వైద్య నిపుణులు, అథ్లెట్లు, వెల్‌నెస్ ఔత్సాహికులు విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. ఇప్పుడు హైదరాబాద్ నగరంలో కూడా దాని ప్రయోజనాలు అందరికీ అందుబాటులోకి వచ్చాయి.సయ్యద్ ఖలీల్, ఫిజికల్ థెరపిస్ట్: “మేము హైదరాబాద్‌లో మొట్టమొదటి హెచ్‌బిఒటి (హైపర్‌బారిక్ ఆక్సిజన్ థెరపీ) ఛాంబర్‌ను పరిచయం చేయడం ఎంతో ఆనందంగా ఉంది. ఇది ‘మేక్ ఇన్ ఇండియా’ ఉత్పత్తి గా, ఆరోగ్య పునరుద్ధరణ మరియు యాంటీ-ఏజింగ్ పరిష్కారాలను విప్లవాత్మకంగా మార్చుతోంది. ఈ అత్యాధునిక చికిత్స ఆక్సిజన్ శోషణను పెంచి, మానవ శరీరపు స్వాభావిక నయం చేసే శక్తిని వేగవంతం చేస్తుంది మరియు మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఒత్తిడి పెంచిన ఛాంబర్‌లో 100% శుద్ధ ఆక్సిజన్ శ్వాసించడం ద్వారా కణాల పునరుద్ధరణ మెరుగుపడి, వాపు తగ్గి, రోగనిరోధక శక్తి పెరుగుతుంది. నాడీ సంబంధిత ఆరోగ్యం, మెటాబాలిక్ ఆరోగ్యం, మరియు జీవనశైలి పునరుద్ధరణ వంటి అనేక ప్రయోజనాలతో, హెచ్‌బిఒటి ఆధునిక ఆరోగ్య సంరక్షణలో గేమ్-చేంజర్‌గా మారింది.రుజువైన ప్రయోజనాలు-యాంటీ ఏజింగ్, రికవరీ విషయంలో సమూల మార్పులు రాస్ మెడికల్ ఫిట్‌నెస్ సెంటర్‌ను ప్రారంభించినప్పటి నుంచి రోగులు వేగంగా కోలుకోవడానికి, ఆరోగ్యం మెరుగుపడడానికి సేవలు అందిస్తోంది. ఇప్పటివరకు పలు విభాగాల్లో అసాధారణ ఫలితాలు సాధించింది. వాటిలో ప్రధానమైనది యాంటీ ఏజింగ్, చర్మ పునరుజ్జీవనం.

**వయసుతో వచ్చే సమస్యలకు సరైన పరిష్కారం**

హెచ్‌బీఓటీ చికిత్స వల్ల చర్మం మీద అసాధారణ ప్రభావాలు కనిపిస్తాయని ఇప్పటికే శాస్త్రీయంగా రుజువైంది. బయటి వాతావరణంలో మనం గాలి పీల్చుకునేటప్పుడు అందులో 20 శాతం మాత్రమే ఆక్సిజన్ ఉంటుంది. దాన్ని మనం పీల్చుకుని, మళ్లీ 15% బయటకు వదిలేస్తాం. అంటే, 5 శాతం ఆక్సిజన్ మాత్రమే మన శరీరంలోకి వెళ్తుంది.

# భారత్‌లోకి టెస్లా ఎంట్రీ..

## - వయా బెర్లిన్ రూట్




**అమెరికాకు చెందిన ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా భారత మార్కెట్లోకి ప్రవేశించడం దాదాపు ఖరారైంది. ప్రపంచంలోని వివిధ దేశాల్లో కార్లు తయారుచేస్తున్న ఆ సంస్థ.. భారత్‌లో ప్లాంట్‌ను నెలకొల్పుతుందా? లేదా? అనే దానిపై ఇంకా స్పష్టత రావాల్సిఉంది. తొలుత దిగుమతి చేసిన మోడళ్లను దేశీయంగా విక్రయించాలని ఆ కంపెనీ భావిస్తోంది. వీటిని పొరుగునున్న చైనా నుంచి కాకుండా జర్మనీ రాజధాని బెర్లిన్‌లోని తమ అతిపెద్ద గిగా ఫ్యాక్టరీ నుంచి దిగుమతి చేసే అవకాశం ఉంది.**

విద్యుత్ కార్ల దిగుమతికి సంబంధించి గతేడాది మార్చిలో భారత ప్రభుత్వం కొత్త ఈవీ పాలసీని తీసుకొచ్చింది. దీనికింద రూ.4,150 కోట్ల పెట్టుబడికి హామీ ఇచ్చి 15 శాతం సుంకంతో ఏటా 8 వేల వాహనాలను దిగుమతి చేసుకోవచ్చు. దేశీయంగా తయారీలో స్థానికంగా ముడిసరకు సమకూర్చుకోవాలన్న నిబంధన కూడా ఉంది. ఈ పాలసీని వినియోగించుకొని భారత్‌లోకి ఎంట్రీ ఇవ్వాలని టెస్లా భావిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. మరోవైపు నిన్న మొన్నటివరకు దేశీయంగా మస్క్ విద్యుత్ కార్ల తయారీ ప్లాంట్ నెలకొల్పకపోవచ్చన్న ఊహాగానాలు వినిపించాయి. కానీ, తాజాగా అమెరికా అధ్యక్షుడు ట్రంపే స్వయంగా భారత్‌లో టెస్లా ప్లాంట్ ఏర్పాటు గురించి ప్రస్తావించడంతో అలాంటిదేమీ లేదని తేలింది.

అమెరికాలో తయారైన కార్లకు లెఫ్ట్‌హ్యాండ్ డ్రైవింగ్ ఉంటుంది. మన దేశంలో రైట్ హ్యాండ్ డ్రైవింగ్ ఉంటుంది. పొరుగునున్న చైనాలో పెద్దఎత్తున రైట్ హ్యాండ్ డ్రైవింగ్ మోడళ్లను టెస్లా ఉత్పత్తి చేస్తోంది. అయితే, చైనాతో ఉన్న వివాదాల దృష్ట్యా డ్రాగన్ దేశం నుంచి దిగుమతుల విషయంలో టెస్లాకు భారత్ అభ్యంతరం తెలిపినట్లు తెలిసింది. దీంతో జర్మనీలోని బెర్లిన్ ఫ్యాక్టరీ నుంచి రైట్ హ్యాండ్ డ్రైవింగ్ కార్లను భారత్‌కు తీసుకురావాలని కంపెనీ భావిస్తోంది. ఇక్కడ టెస్లా వై మోడళ్లు తయారవుతున్నాయి.

వీటినే భారత్‌కు తేనున్నారు. మరోవైపు ప్లాంట్ ఏర్పాటు విషయంలో గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు వంటి రాష్ట్రాలు ప్రధానంగా పోటీ పడుతున్నాయి. ఏపీ, తెలంగాణ కూడా ఈ రేసులో ఉన్నాయి.




## ఎస్‌బీఐ బాటలోనే పీఎన్‌బీ.. రుణాలపై వడ్డీ రేట్లు తగ్గింపు

దిల్లీ: దాదాపు ఐదేళ్ల తర్వాత రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇటీవల రెపో రేటును తగ్గించింది. దానికి అనుగుణంగా ఇప్పుడు బ్యాంకులు కూడా రుణ రేట్లను సవరిస్తున్నాయి. ఇటీవల ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వడ్డీరేట్లను తగ్గించగా.. ఇప్పుడు మరో ప్రభుత్వ బ్యాంకు పీఎన్‌బీ కూడా అదే నిర్ణయం తీసుకుంది. రిటైల్ రుణాలపై 25 బేసిస్ పాయింట్ల వరకు వడ్డీ రేట్లను తగ్గిస్తున్నట్లు పంజాబ్ నేషనల్ బ్యాంక్ గురువారం ప్రకటించింది.

**కొత్త వడ్డీ రేట్లు ఫిబ్రవరి 10 నుంచే అమల్లోకి తీసుకొచ్చినట్లు బ్యాంకు తాజా ప్రకటనలో వెల్లడించింది. గృహ రుణాలతో పాటు, కారు, ఎడ్యుకేషన్, పర్సనల్ లోన్లపై ఈ తగ్గింపు వర్తించనుంది. తాజా సవరణతో పీఎన్‌బీలో గృహ రుణాల ప్రారంభ రేటు 8.15శాతానికి దిగొచ్చింది. దీంతో రూ.లక్ష రుణానికి ఈఎంఐ రూ.744గా ఉంటుందని బ్యాంకు తెలిపింది.**

ఇక, ఆటోమొబైల్ రుణాలపై వడ్డీ రేటు 8.50 శాతం నుంచి ప్రారంభం కానుంది. విద్యా రుణాలపై కనిష్ఠ వడ్డీని 7.85 శాతానికి తగ్గించినట్లు పీఎన్‌బీ తెలిపింది. అటు వ్యక్తిగత రుణాలపై సవరించిన వడ్డీ రేటు 11.25శాతంగా ఉన్నట్లు పేర్కొంది.

ఫిబ్రవరి 7న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేటును 6.50 శాతం నుంచి 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 6.25 శాతానికి తగ్గించిన సంగతి తెలిసిందే. దీంతో పలు బ్యాంకులు కూడా తమ రుణాలపై వడ్డీ రేట్లను సవరిస్తున్నాయి. గతవారం ఎక్స్‌టర్నల్ బెంచ్ మార్క్ ఆధారిత లెండింగ్ రేట్, రెపో లింక్డ్ లెండింగ్ రేట్లను ఎస్‌బీఐ 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది.

## నష్టాల్లో ప్రారంభమైన స్టాక్ మార్కెట్ సూచీలు

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం నష్టాల్లో ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలో ప్రతికూల సంకేతాల నేపథ్యంలో మార్కెట్లు నష్టాల బాటపట్టాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ, ఎంఅండ్ఎం వంటి ప్రధాన షేర్లలో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. దీంతో మార్కెట్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి. మార్కెట్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 300 పాయింట్ల నష్టంతో.. నిఫ్టీ 22,850 కింద ట్రేడింగ్ మొదలుపెట్టాయి.



# గూగుల్ పేలో బిల్లు పేమెంట్స్‌పై ఫీజు!

**గూగుల్‌కు చెందిన పేమెంట్ యాప్ గూగుల్ పే విద్యుత్, గ్యాస్ వంటి బిల్ పేమెంట్లపైనా ఛార్జీలు వసూలు చేస్తోంది. ఇప్పటివరకు ఈతరహా లావాదేవీలపై ఎలాంటి ఫీజూ విధించేది కాదు. ఇకనుంచి క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు ద్వారా చేసే లావాదేవీలపై కన్వీనియన్స్ ఫీజు రూపంలో స్వల్ప మొత్తంలో రుసుము వసూలుచేసేందుకు సిద్ధమైంది. యూపీఐ లావాదేవీలకు మాత్రం ఈ ఛార్జీలు వర్తించవు. ఇతర పేమెంట్ ప్లాట్‌ఫామ్‌లైన పేటీఎం, ఫోన్‌పే సంస్థలు ఇప్పటికే ఈతరహా ఫీజును వసూలుచేస్తుండగా.. ఇన్నాళ్లూ ఉచితంగా అందించిన గూగుల్ పే సైతం ఇకనుంచి వాటి బాటలోనే నడవనుంది.**

గూగుల్‌పే మొబైల్ రీఛార్జీలపై రూ.3 కన్వీనియన్స్ ఫీజు రూపంలో గతేడాది నుంచి వసూలుచేస్తోంది. ఇకపై క్రెడిట్, డెబిట్ కార్డు ద్వారా చేసే విద్యుత్, గ్యాస్ బిల్ పేమెంట్లపై 0.5 శాతం నుంచి 1 శాతం వరకు ఛార్జీలు విధిస్తున్నట్లు తెలుస్తోంది. గూగుల్‌పేలో ఇటీవల క్రెడిట్ కార్డ్ ద్వారా విద్యుత్ బిల్లు చెల్లించిన ఓ యూజర్‌కు ఈ అనుభవం ఎదురైనట్లు ఓ ఆంగ్లమీడియా సంస్థ ఉదాహరణను ఉటంకించింది. తాను చెల్లించిన కరెంట్ బిల్‌పై రూ.15 కన్వీనియన్స్ ఫీజు రూపంలో గూగుల్ పే వసూలు చేసినట్లు ఆ వ్యక్తి పేర్కొన్నాడు. దీంతో ఈ పేమెంట్ ప్లాట్‌ఫామ్ ఇప్పటికే ఛార్జీల వసూలు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది.




**అయితే ఈ రుసుములు అందరికీ వర్తిస్తాయా? లేదా? అనే విషయం ఇంకా తెలియరాలేదు. భవిష్యత్‌లో అందరినుంచీ ఈ ఫీజు వసూలు చేసే అవకాశం ఉందని టెక్ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే దీనిపై గూగుల్ పే ఎక్కడా అధికారికంగా వివరాలు వెల్లడించలేదు. గూగుల్‌పే వెబ్‌సైట్ ప్రకారం.. కార్డ్ పేమెంట్ ప్రాసెసింగ్ ఖర్చుల్ని కవర్ చేసేందుకు ఈ రుసుము సాయపడుతుందని పేర్కొంది. ఇప్పటికే అనేక ఫిన్‌టెక్, క్విక్‌కామర్స్, ఫుడ్ డెలివరీ సంస్థలు ప్లాట్‌ఫామ్ ఫీజు వసూలుచేయడం ప్రారంభించాయి. ఇదే ట్రెండ్‌ను ఇతర సంస్థలూ అనుసరించే అవకాశం ఉందని, తమ ఆదాయాలు పెంచుకోవడానికి ఈ మొత్తాలు ఉపయోగపడతాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.**

# ఆ నిర్ణయం తీసుకున్నందుకు బాధ పడ్డా: బిల్ గేట్స్

మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ తన కాలేజీ జీవితం గురించి పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు. హార్వర్డ్ యూనివర్సిటీలో చదువు మానేయాలనే నిర్ణయం తీసుకున్నప్పుడు చాలా బాధపడినట్లు తెలిపారు. 'సోర్స్ కోడ్ – మై బిగినింగ్స్' పేరిట తాను తీసుకొచ్చిన పుస్తకంలో పలు ఆసక్తికర విషయాల్ని తాజాగా పాల్గొన్న ఓ కార్యక్రమంలో పంచుకున్నారు.

కళాశాల రోజులు చాలా ఆహ్లాదకరంగా గడిచాయని ఆనాటి రోజులను గుర్తుకుతెచ్చుకున్నారు. "హార్వర్డ్‌లో బాగా ఎంజాయ్ చేశాను. మనస్తత్వశాస్త్రం, ఆర్థిక శాస్త్రం, చరిత్రకు సంబంధించిన తరగతులను ఆస్వాదించేవాడిని. తెలివైన వాళ్లతో సమయం గడపడం నాకు నచ్చేది. ఆసక్తికరమైన విషయాలపై రాత్రిళ్లూ చర్చించేవాళ్లం" అని గేట్స్ అన్నారు. 1975లో సాఫ్ట్‌వేర్ కంపెనీ తొలి సీఈవోగా బాధ్యతలు చేపట్టేందుకు హార్వర్డ్ యూనివర్సిటీలో చదువు మానేయాల్సి వచ్చిందని బిల్‌గేట్స్ వెల్లడించారు. ఆ నిర్ణయం తీసుకోవడం చాలా బాధను కలిగించిందన్నారు. డిగ్రీ పూర్తిచేసేందుకు హార్వర్డ్‌కు తిరిగి వెళ్లాలనిపించిందన్నారు.

అయితే వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకొనేందుకు తాను, తన స్నేహితుడు అయిన పాల్‌అలెన్‌ను, కళాశాలను విడిచిపెట్టాల్సి వచ్చిందని గేట్స్ తెలిపారు. ఆ సమయంలో గేట్స్, అలెన్ ఇద్దరూ కంప్యూటర్ల కోసం ఒక సాఫ్ట్‌వేర్‌ను సృష్టించగలిగితే కొత్త పరిశ్రమలో ముందంజలో ఉండగలమని భావించారు. అలా రెండేళ్లు మైక్రోసాఫ్ట్‌ను నడుపుతూనే తన చదువును బ్యాలెన్స్ చేసేందుకు ప్రయత్నించారు. తన చదువు పూర్తి చేసేందుకు మరో స్నేహితుడు, మైక్రోసాఫ్ట్ ప్రోగ్రామర్ అయిన రిక్ వీలాండ్ సాయం తీసుకోవాలనుకున్నారు. కానీ అది కుదరలేదు. ఇక చివరకు చదువు మానేయాల్సి వచ్చిందని తెలిపారు.



ఇదిలాఉంటే.. 'సోర్స్ కోడ్' పుస్తకాన్ని మూడు భాగాలుగా తీసుకొస్తున్నారు. వాల్యూమ్–1లో తన చిన్ననాటి సంగతులు, డ్రగ్స్‌తో ప్రయోగం లాంటి వివరాలను మాత్రమే గేట్స్ ప్రస్తావించారు. తన ఉద్యోగ జీవితం, మైక్రోసాఫ్ట్‌లో ప్రయాణం, మెలిందా గేట్స్‌తో వివాహం, దాతృత్వ కార్యక్రమాలకు దీనిలో చోటు కల్పించలేదు. భవిష్యత్‌లో విడుదల చేసే పుస్తకాల్లో వాటి గురించి వివరించే అవకాశముంది. 2000 సంవత్సరం వరకు మైక్రోసాఫ్ట్ సీఈఓగా గేట్స్ విధులు నిర్వర్తించారు. తన పదవీకాలంలో కంప్యూటర్ పరిశ్రమలో విప్లవాత్మక మార్పుల్ని తీసుకొచ్చారు. ప్రపంచంలోనే అత్యంత ధనవంతుల్లో ఒకరిగా నిలిచారు.

# ఒంటరితనం భయంకరంగా ఉంటుంది

- సమంత



ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే సమంత తనకు సంబంధించిన విశేషాలను అభిమానులతో పంచుకుంటుంటారు. విహారయాత్రల గురించి షేర్ చేస్తుంటారు. తాజాగా ఆమె పెట్టిన పోస్ట్ వైరల్‌గా మారింది. ప్రస్తుతం ఉన్న సోషల్ మీడియా యుగంలో మూడు రోజులు ఫోన్‌కు దూరంగా ఉన్నట్లు తెలిపారు. ఆ అనుభవాన్ని తన ఇన్‌స్టాలో షేర్ చేశారు.

"మూడు రోజులు మౌనంగా ఉన్నాను. ఫోన్ లేదు. ఎవరితో కమ్యూనికేషన్ లేదు. నాతో నేను మాత్రమే ఉన్నాను. మనతో మనం ఒంటరిగా ఉండడం కష్టమైన విషయాల్లో ఒకటి. భయంకరమైనది. కానీ, ఇలా మౌనంగా ఉండడాన్ని నేను ఇష్టపడతాను. మిలియన్‌సార్లు ఇలా ఒంటరిగా గడపమని చెప్పినా ఉంటాను. మీరు కూడా ఇలా ఉండటానికి ప్రయత్నించండి" అంటూ అభిమానులకు సూచనలిచ్చారు. తన జీవితంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్న సమంత ప్రస్తుతం ఆరోగ్యంపై పూర్తి శ్రద్ధ పెట్టినట్లు తెలుస్తోంది.

ఇక సినిమాల విషయానికొస్తే.. తెరపై మహిళా ప్రాధాన్య కథలతో ప్రేక్షకులను మెప్పిస్తున్న సమంత.. మరోవైపు ఓటీటీ వేదికగా భిన్నమైన కథలతో సత్తా చాటుతున్నారు. ఆమె, వరుణ్ ధావన్ కీలకపాత్రల్లో నటించిన 'సిటడెల్ : హనీ బన్నీ' వెబ్‌సిరీస్‌కు తాజాగా ఐకానిక్ గోల్డ్ అవార్డ్ లభించింది. ఉత్తమ వెబ్‌సిరీస్‌గా అవార్డు గెలుచుకుంది. ప్రస్తుతం 'రక్త్‌బ్రహ్మాండ్'తో బిజీగా ఉన్నారు. ది బ్లడీ కింగ్‌డమ్ అనేది ఉపశీర్షిక. 'తుంబాడ్' ఫేమ్ రాహి అనిల్ బార్వే దర్శకుడు. ఇటీవలే దీని షూటింగ్‌లో జాయిన్ అయినట్లు సమంత తెలిపారు. 'మళ్లీ యాక్షన్ మోడ్‌లోకి వచ్చేశా' అంటూ పోస్ట్ పెట్టారు. ఇప్పటి వరకు తెరపైకి రాని కథతో దీన్ని రూపొందిస్తున్నారు. ఆదిత్యరాయ్ కపూర్ కీలక పాత్ర పోషిస్తున్నారు.

# నన్ను క్షమించండి.. ఇక అసభ్యత లేకుండా సినిమాలు చేస్తా

- విశ్వక్‌సేన్



హైదరాబాద్: ఇటీవల తాను నటించిన సినిమాలు ఆశించిన స్థాయిలో ఆడలేదని, ఇక నుంచి ప్రేక్షకులు మెచ్చేలా చేస్తానని కథానాయకుడు విశ్వక్‌సేన్ అన్నారు. రామ్ నారాయణ్ దర్శకత్వంలో ఆయన నటించిన 'లైలా' బాక్సాఫీస్ వద్ద మెప్పించలేకపోయింది. అంతకు ముందు 'మెకానిక్ రాకీ' పర్వాలేదనిపించినా, 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' ఘోర పరాజయాన్ని అందుకుంది. దీంతో తనని ఆదరిస్తున్న ప్రేక్షకులను ఉద్దేశిస్తూ విశ్వక్ ఒక ప్రకటన విడుదల చేశాడు.

"అందరికీ నమస్కారం.. ఇటీవల నా సినిమాలు అందరూ కోరుకున్న స్థాయికి చేరుకోలేకపోయాయి. నా చివరి సినిమాకు వచ్చిన నిర్మాణాత్మక విమర్శను పూర్తిగా అంగీకరిస్తున్నా. నన్ను నమ్మి, నా ప్రయాణానికి మద్దతు ఇచ్చిన నా అభిమానులకు, నాకు ఆశీర్వాదంగా నిలిచిన వారికి హృదయపూర్వక క్షమాపణలు. నా ప్రాధాన్యం ఎప్పుడూ కొత్తదనం తీసుకురావడమే. కానీ, ఆ ప్రయత్నంలో మీ అభిప్రాయాలను నేను గౌరవిస్తున్నా. ఇకపై నా ప్రతి సినిమా క్లాస్, మాస్ ఏదైనా సరే, అసభ్యత ఉండదు. నేను ఒక చెడు సినిమా తీస్తే, నన్ను విమర్శించే హక్కు పూర్తిగా మీకు ఉంది. ఎందుకంటే, నా ప్రయాణంలో ఎవ్వరూ లేని సమయంలో నన్ను ప్రేమతో ముందుకు నడిపించింది మీరే (ప్రేక్షకులు)"

"నా కెరీర్ ప్రారంభం నుంచి నేను ఎంచుకున్న కథలను మీరు ఎంతగా ప్రేమించారో తెలుసు. ఇకపై కేవలం సినిమా మాత్రమే కాదు, నా ప్రతి సన్నివేశం కూడా మీ మనసుకు తగిలేలా ఉండాలని నిర్ణయించుకున్నా. అంతే కాకుండా, నా మీద విశ్వాసం ఉంచిన ప్రొడ్యూసర్స్, డిస్ట్రిబ్యూటర్స్ అందరికీ నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. అలాగే, నా కథానాయకులు దర్శకులు, రచయితలు నా వెన్నెముకగా నిలిచి, నన్ను మలిచిన ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. మీ అందరి నిర్మాణాత్మక విమర్శలకు ధన్యవాదాలు. త్వరలోనే మరొక బలమైన కథతో ముందుకు వస్తా. నా మంచి, చెడు కాలాల్లో నన్ను నమ్మిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. మీ మద్దతు నాకు ఎంతో ప్రాముఖ్యం" – మీ విశ్వక్ సేన్

ప్రస్తుతం విశ్వక్‌సేన్, 'జాతిరత్నాలు' ఫేం అనుదీప్.కె.వితో 'ఫంకీ'లో నటిస్తున్నారు. ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ కలిసి రూపొందిస్తున్నాయి. ప్రేమ, వినోదంతో కూడిన ఓ కుటుంబ కథతో ఈ సినిమా రూపొందుతోందని, అన్ని వయసుల ప్రేక్షకులూ కడుపుబ్బా నవ్వుకునేలా ఉంటుందని సినీ వర్గాలు తెలిపాయి.

# ఆ రెండు భాషల్లో పాటలు పాడటం కష్టం - శ్రేయాఘోషల్

సినిమాల్లో పాటలతోనే కాకుండా వరుస లైవ్ మ్యూజికల్ కాన్సర్ట్స్‌తో సంగీత ప్రియులను అలరిస్తున్నారు ప్రముఖ గాయని శ్రేయాఘోషల్. గతేడాది నవంబర్‌లో హైదరాబాద్ వేదికగా తన బృందంతో కలిసి లైవ్ కాన్సర్ట్ నిర్వహించిన ఆమె త్వరలో చెన్నై, కోయంబత్తూర్‌లో జరగనున్న ఈవెంట్స్‌లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా చెన్నైలో జరిగిన ప్రెస్‌మీట్‌లో ఆమె పాల్గొన్నారు. మ్యూజిక్ అంటే తనకెంతో ఇష్టమని అన్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రేక్షకులు తన పాటలను విశేషంగా ఆదరించడం సంతోషంగా ఉందని చెప్పారు.



మిగిలిన అన్ని భాషలతో పోలిస్తే మలయాళం, తమిళంలో పాటలు పాడటమే తనకు ఒకింత కష్టంగా ఉంటుందని తెలిపారు. ఆయా భాషల్లో పాటలు పాడేందుకు కాస్త ఎక్కువగా సమయం తీసుకుంటానని అన్నారు. అనంతరం ఆమె అభిమానుల కోసం 'మున్బే వా ఎన్ అన్బే వా' పాటను ఆలపించారు. చెన్నై వేదికగా మార్చి 1వ తేదీన, కోయంబత్తూర్‌లో మార్చి 15న ఆమె కాన్సర్ట్ జరగనుంది.

# 'సంక్రాంతికి వస్తున్నాం'పై జీ5 సరదా పోస్ట్.. టీవీలోనా.. ఓటీటీలోనా

ఈ సంక్రాంతికి ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకున్నారు అగ్ర కథానాయకుడు వెంకటేశ్. ఆయన హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం' మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ చిత్రం ఓటీటీలోకి ఎప్పుడు వస్తుందా అని సినీ ప్రియులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈనేపథ్యంలో జీ5 ఈ సినిమాపై పెట్టిన పోస్ట్ ఆకట్టుకుంటోంది.

దీని డిజిటల్/ఓటీటీ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ జీ5 కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమాపై జీ5 సరదా పోస్ట్ పెట్టింది. "ఏమండోయ్.. వాళ్లు వస్తున్నారు. మరిన్ని వివరాలు, కూసంత చమత్కారం కోసం వేచి చూడండి. త్వరలోనే మరిన్ని వివరాలను ప్రకటిస్తాం" అని పోస్ట్ పెట్టింది. దీంతో ఈ సినిమా ఓటీటీపై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని అభిమానులు ఆశిస్తున్నారు.

తొలుత అనుకున్న ఒప్పందం ప్రకారం ఫిబ్రవరి 2వ వారంలో ఈ మూవీ ఓటీటీలో స్ట్రీమింగ్‌కు తీసుకురావాల్సి ఉంది. అయితే దీనికి ఊహించని స్పందన రావడంతో ఓటీటీ తేదీలో మార్పులు చేసినట్లు తెలుస్తోంది. ఇటీవల కూడా ఈ సినిమా గురించి జీ5 పోస్ట్ పెట్టిన విషయం తెలిసిందే. ఆ పోస్ట్‌కు ఓటీటీ కన్నా ముందే టీవీలో అంటూ హ్యాష్‌ట్యాగ్‌ను జోడించింది. దీంతో ఈ సినిమా టీవీలో వచ్చిన తర్వాత ఓటీటీలోకి రానుందని స్పష్టమైంది. తాజాగా జీ5 పెట్టిన పోస్ట్ టీవీలో టెలికాస్ట్ గురించా లేదంటే ఓటీటీ గురించా అనేది ఆసక్తికరంగా మారింది.



## మెడికల్ కాలేజ్ టాపర్.. బాస్కెట్ బాల్ ఛాంపియన్

# ఈ 'ఛావా' నటుడు



ప్రస్తుతం భారతీయ సినిమాలో హాట్‌టాపిక్ 'ఛావా' . శంభాజీ మహారాజ్‌గా విక్కీ కౌశల్ నటనకు సినీ అభిమానులు ఫిదా అవుతున్నారు. యేసుబాయి, ఔరంగజేబు పాత్రలు పోషించిన రష్మిక, అక్షయ్ ఖన్నాల నటననూ మెచ్చుకుంటున్నారు. ఇక ఇందులో కవి కలాష్ పాత్రలో నటించి మెప్పించారు వినీత్ కుమార్. శంభాజీతో పాటు, కవి కలాష్‌ను మొగల్ సేనలు బంధిస్తాయి. ఆ తర్వాత హింసించి చంపుతాయి. ముఖ్యంగా క్లైమాక్స్ శంభాజీ, కవి కలాష్‌ల మధ్య జరిగే సంభాషణ భావోద్వేగానికి గురి చేస్తుంది. మరి అలాంటి ముఖ్యమైన పాత్ర పోషించిన వ్యక్తి గురించి ఈ ఆసక్తికర విషయాలు తెలుసా?

- వినీత్ కుమార్ సింగ్ ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసిలో జన్మించాడు. తండ్రి గణిత శాస్త్రజ్ఞుడు.
- చిన్నప్పటి నుంచి బాస్కెట్ బాల్ ఆటగాడైన వినీత్ జాతీయ స్థాయిలో క్రీడాకారుడిగానూ మెరిశాడు.
- కంబైన్డ్ ప్రీ మెడికల్ టెస్ట్ (సీపీఎంటీ) క్వాలిఫై అవడమే కాదు, మెడికల్ కాలేజ్ టాపర్‌గానూ నిలిచాడు.
- ఆర్‌ఏ పొద్దార్ ఆయుర్వేద మెడికల్ కాలేజ్ నుంచి బ్యాచ్‌లర్ ఆఫ్ ఆయుర్వేద, మెడిసన్ అండ్ సర్జరీ పూర్తి చేశాడు.
- గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పటల్ నాగ్‌పూర్‌లో ఎండీ చేశారు.
- 2002లో సంజయ్‌దత్ నటించిన 'పితః' వెండితెరకు పరిచయం అయ్యారు. 'గ్యాంగ్స్ ఆఫ్ వాసేపుర్' చిత్రాలు వినీత్‌కుమార్‌కు మంచి పేరు తీసుకొచ్చాయి.
- 'ముక్కాబాజ్'లో నటనకు గానూ ఫిల్మ్‌ఫేర్ అవార్డును అందుకున్నారు.
- ప్రస్తుతం 'ఛావా' మంచి పేరు తీసుకురాగా, 'జాట్', 'సూపర్‌బాయ్స్ ఆఫ్ మాలేగావ్' చిత్రాల్లో నటిస్తున్నారు.

"దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్‌కు ధన్యవాదాలు. కథా చర్చలు జరుగుతున్నప్పుడే క్లైమాక్స్ సీన్ గురించి చాలా స్పష్టంగా చెప్పారు. కవి కలాష్‌ను చంపడానికి శంభాజీ నుంచి అతడిని దూరం తీసుకెళ్లే కొద్దీ ఇద్దరి మధ్య జరిగే జుగల్‌బందీ హైపిచ్‌లో ఉంటుంది. ఆ సీన్ చిత్రకరిస్తున్నప్పుడు అదొక అద్భుతంలా అనిపించింది. అయితే, క్లైమాక్స్‌లో కవిత్వం అంతలా భాగమవుతుందని, ప్రభావం చూపుతుందని అనుకోలేదు. ఇదొక అద్భుతంకాక ఇంకేమనాలి" అని వినీత్ కుమార్ చెప్పుకొచ్చారు. కవి కలాష్ పాత్రకు వినీత్ కనీసం ఆడిషన్ కూడా ఇవ్వలేదట.

## ఛాంపియన్స్ ట్రోఫీలో శుభ్‌మన్ గిల్ సెంచరీ..

# బంగ్లాపై భారత్ విజయం

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ శుభారంభం చేసింది. దుబాయ్ వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమ్ఇండియా ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లా 49.4 ఓవర్లలో 228 పరుగులకు ఆలౌటైంది. అనంతరం లక్ష్య ఛేదనలో భారత్ 46.3 ఓవర్లలో నాలుగు వికెట్లను కోల్పోయి 231 పరుగులు చేసి విజయం సాధించింది. భారత ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (101లి) సెంచరీ బాదాడు. కెరీర్‌లో ఇది 8వ శతకం కాగా.. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో తొలి సెంచరీ కావడం విశేషం.

### రోహిత్ దూకుడు..

ఇంగ్లండ్‌పై సెంచరీ సాధించి దూకుడు మీదున్న కెప్టెన్ రోహిత్ శర్మ (41) అదే ఆటతీరును ఇక్కడా ప్రదర్శించాడు. తొలి వికెట్‌కు మరో ఓపెనర్ గిల్‌తో కలిసి 10 ఓవర్లలోపే 69 పరుగులు జోడించాడు.



రోహిత్ ఔటైన తర్వాత క్రీజ్‌లోకి వచ్చిన విరాట్ (22) కాస్త ఆచితూచి ఆడాడు. షాట్లు కొట్టకుండా సింగిల్స్‌కు పరిమితమయ్యాడు. స్పిన్నర్ రిషద్ బౌలింగ్‌లోనే కోహ్లి వికెట్ ఇచ్చేశాడు. శ్రేయస్ అయ్యర్ (15) కాసేపు చూడచక్కని ఆటతీరు ప్రదర్శించాడు. అయితే, ఎక్కువ సమయం క్రీజ్‌లో ఉండలేదు. ఇంగ్లండ్‌తో సిరీస్‌లో ఐదో స్థానంలో ఆకట్టుకున్న అక్షర్ పటేల్ (8) ఈసారి తేలిపోయాడు. మరోవైపు వికెట్లు పడుతున్నా సరే ఏకాగ్రతను కోల్పోకుండా శుభ్‌మన్ గిల్ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. కేఎల్ రాహుల్ (40లి)తో కలిసి జట్టును గెలిపించాడు. ఈ క్రమంలో కేఎల్‌కు అదృష్టం కూడా కలిసొచ్చింది. చేతిలో పడిన క్యాచ్‌ను బంగ్లా ఫీల్డర్ చేజార్చాడు. స్పిన్నర్లు ప్రభావం చూపించడంతో భారత బ్యాటర్లు ఆచితూచి ఆడి పరుగులు రాబట్టారు. కేఎల్ – గిల్ ఐదో వికెట్‌కు 87 పరుగులు జోడించి జట్టును గెలిపించారు.

### ఆ క్యాచ్ మిస్ చేయకపోతే..

**బంగ్లాదేశ్ 35/5 స్కోరుతో ఉన్నప్పుడు అక్షర్ పటేల్ బౌలింగ్‌లో జకేర్ అలీ (68) ఇచ్చిన క్యాచ్‌ను స్లిప్‌లో కెప్టెన్ రోహిత్ వదిలేశాడు. అక్షర్ పటేల్ హ్యాట్రిక్ కూడా మిస్ అయిపోయింది. అక్కడ్నుంచే బంగ్లా ఇన్నింగ్స్ ముందుకు సాగింది. జకేర్‌తో కలిసి సెంచరీ హీరో తౌహిద్ హృదోయ్ (100) ఇన్నింగ్స్‌ను నడిపించాడు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు 154 పరుగులు జోడించారు. జకేర్ ఔటైనా సరే తౌహిద్ మాత్రం చివరి వికెట్‌గా వెనుదిరిగి జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించాడు. ఒకవేళ జకేర్ ఇచ్చిన క్యాచ్‌ను అందుకొని ఉంటే భారత్ ఎదుట ఆమాత్రం లక్ష్యం కూడా ఉండేది కాదు. టీమ్ఇండియా కూడా ఇంత కష్టపడాల్సిన అవసరం లేకుండా పోయేది. అయితే, భారత సీనియర్ పేసర్ షమీ (5/53) మరోసారి ఐసీసీ టోర్నీలో సత్తా చాటాడు. ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. అతడితోపాటు హర్షిత్ 3, అక్షర్ పటేల్ 2 వికెట్లు తీశారు.**








# బంగ్లాపై ఐదు వికెట్ల ప్రదర్శన..

## షమీ ఖాతాలో ప్రపంచ రికార్డు




ఐసీసీ ట్రోఫీలంటే చాలు చెలరేగిపోయే భారత సీనియర్ పేసర్ మహ్మద్ షమీ మరో ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. బంగ్లాదేశ్‌పై ఐదు వికెట్ల ప్రదర్శన చేసిన షమీ.. ప్రపంచ రికార్డును సాధించాడు. అత్యంత వేగంగా 200 వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. అయితే, ఇదంతా బంతులపరంగానే. ఇప్పటి వరకు ఈ స్థానంలో ఆసీస్ స్టార్ బౌలర్ మిచెల్ స్టార్క్ ఉన్నాడు. స్టార్క్ 5,240 బంతుల్లో 200 మార్క్‌ను అందుకోగా.. షమీ 5,126 బంతుల్లోనే 200 వికెట్లు తీయడం విశేషం. ఇక మ్యాచులపరంగా స్టార్క్ (102 వన్డేల్లో) ముందుండగా.. షమీ (104) రెండో స్థానంలో ఉన్నాడు.

ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ తరఫున రెండో అత్యుత్తమ గణాంకాలను నమోదు చేసిన బౌలర్‌గా షమీ నిలిచాడు. బంగ్లాపై 5/53 గణాంకాలను నమోదు చేశాడు. అతడికంటే ముందు రవీంద్ర జడేజా (2013లో) విండీస్‌పై 5/36 గణాంకాలను సాధించాడు. వరల్డ్ కప్, ఛాంపియన్స్ ట్రోఫీ ఈవెంట్లలో భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గానూ షమీ నిలిచాడు. ఇప్పటి వరకు 60 వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. జహీర్ ఖాన్ (59), జవగళ్ శ్రీనాథ్ (47), రవీంద్ర జడేజా (43) తర్వాత స్థానాల్లో ఉన్నారు.

# పాకిస్థాన్‌కు మరో దెబ్బ.. ఈసారి పెనాల్టీ రూపంలో!

ఛాంపియన్స్ ట్రోఫీకి ఆతిథ్యం ఇస్తున్నప్పటికీ పాకిస్థాన్ క్రికెట్ జట్టుకు మాత్రం ఏదీ కలిసిరావడం లేదు. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన మొదటి మ్యాచ్‌లోనే ఘోర పరాభవం ఎదురైంది. న్యూజిలాండ్ అన్ని విభాగాల్లో ఆధిపత్యం ప్రదర్శించి విజయం సాధించింది. దీంతో పాక్ (-1.200) నెట్ రన్‌రేట్ కూడా మైనస్‌లోకి వెళ్లిపోయింది. మరోవైపు ఆ జట్టు ఓపెనర్ ఫకర్ జమాన్ గాయం కారణంగా టోర్నీకే దూరమైన పరిస్థితి ఎదురైంది. ఇప్పుడు మరో షాక్ తగిలింది. అయితే, ఇది జరిమానా రూపంలో కావడం గమనార్హం. స్లో ఓవర్‌రేట్ కారణంగా మ్యాచ్ ఫీజులో 5 శాతం జరిమానా విధిస్తూ మ్యాచ్ రిఫరీ నిర్ణయం తీసుకున్నాడు. కివీస్‌తో మ్యాచ్‌లో నిర్దిష్ట సమయానికి ఒక ఓవర్ తక్కువగా వేసినట్లు తేలింది. అయితే, పొరపాటును పాక్ కెప్టెన్ రిజ్వాన్ అంగీకరించాడని.. మరే ఇతర విచారణ అవసరం లేదని రిఫరీ వెల్లడించాడు. ఇదే తప్పిదం పునరావృతమైతే మాత్రం కెప్టెన్‌పై మ్యాచ్ నిషేధం పడే ప్రమాదమూ లేకపోలేదు.




### పాక్ సెలక్షన్‌పై వసీమ్ అక్రమ్ విమర్శలు

తొలి మ్యాచ్‌లో ఓడిపోవడంతో పాక్ జట్టుపై మాజీల నుంచి తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. “జట్టును అత్యంత దారుణంగా నిందించాలంటే నేను ఆ పని చేయగలను. కానీ, మన సంప్రదాయ ప్రకారం ‘వీళ్లంతా మన పిల్లలే. కాబట్టి విమర్శించకూడదు’ అనే ఉద్దేశంలో ఉంటాం. ఇప్పుడు జట్టులో ఉన్నవారంతా బెస్ట్ ప్లేయర్స్ అని అనుకుంటున్నా. ఒకవేళ వీరికంటే అత్యుత్తమంగా ఎవరైనా ఉన్నా సరే వారిని ఎంపిక చేయాల్సిందే. కానీ, అలా జరగడం లేదేమో! ఇక్కడ మాత్రం రిఫరెన్స్‌లతో నెట్టుకొస్తున్నారని అంతా అనుకుంటున్నారు. అంతర్జాతీయ స్థాయిలో అది వర్కౌట్ కాదు. పాకిస్థాన్ ప్రజలకు వివరించి చెప్పడం చాలా కష్టం” అని అక్రమ్ వ్యాఖ్యానించాడు.

### భారత్‌తోనే తదుపరి మ్యాచ్


గ్రూప్ స్టేజ్‌లో ఒక్కో జట్టు మూడేసి మ్యాచ్‌లను ఆడతాయి. అన్నీ గెలిస్తే ఎలాంటి ఆటంకాలు లేకుండా సెమీస్‌కు చేరుకోవడం సులువుతుంది. ఇప్పటికే తొలి మ్యాచ్‌ను ఓడిన పాక్‌కు మాత్రం మిగతా మ్యాచుల్లో తప్పక గెలవాల్సిన పరిస్థితి. భారత్‌తో ఫిబ్రవరి 23న, బంగ్లాదేశ్‌తో ఫిబ్రవరి 27న పాక్ ఆడాలి. ఈ రెండింట్లో గెలిచినా సెమీస్‌కు చేరతామనే నమ్మకం లేదు. మిగతా జట్ల ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది. దుబాయ్ వేదికగా వచ్చే ఆదివారం భారత్‌తో జరగనున్న పోరులో ఓడితే మాత్రం ఇంటిముఖం పట్టినట్లే. అప్పుడు గ్రూప్ స్టేజ్ నుంచి టీమ్ఇండియా, న్యూజిలాండ్ సెమీఫైనల్‌కు దూసుకుపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

# అప్పటికే సంబరాలు చేసుకోవడం మొదలుపెట్టా

**అక్షర్ పటేల్**

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో హ్యాట్రిక్ తీయడమంటే చాలా స్పెషల్. అలాంటి అవకాశం కాస్త చేజారితే ఆ బాధ వర్ణనాతీతం. అదీనూ సులువైన క్యాచ్‌ను వదిలేస్తే... సరిగ్గా బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లోనూ అదే జరిగింది. స్లిప్‌లో సులువైన క్యాచ్‌ను కెప్టెన్ రోహిత్ శర్మ వదిలేశాడు. మరి, అటువైపు బౌలింగ్‌లో ఉన్నది అక్షర్ పటేల్. మరి అతడి రియాక్షన్ ఏంటనేది బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ ముగిశాక వెల్లడించాడు. అప్పటికే తాను సంబరాలు చేసుకోవడం ప్రారంభించినట్లు తెలిపాడు.

**“నిజాయితీగా చెప్పాలంటే నేను అప్పటికే సంబరాలు చేసుకోవడం మొదలెట్టా. బంతి రోహిత్ వద్దకు వెళ్లినప్పుడు కచ్చితంగా క్యాచ్‌గా మారిపోతుందని భావించా. అయితే, కెప్టెన్ క్యాచ్‌ను వదిలేసినట్లు తర్వాత గుర్తించా. ఇంకేం చేస్తాం. అయితే, క్రికెట్‌లో ఇలాంటివన్నీ సహజమే. అందుకే, నేను పెద్దగా ప్రతిస్పందించలేదు. వెంటనే వెనక్కి వెళ్లిపోయి బంతిని వేసేందుకు సిద్ధమయ్యా. అసలు తొలి వికెట్ నాకు రావడమే నమ్మలేకపోయా. తంజిద్ ఔటైనట్లు తొలుత నేను భావించలేదు. కానీ, వికెట్ కీపర్ కేఎల్ రాహుల్ మాత్రం నమ్మకంగా ఉన్నాడు. అతడే ఎక్కువగా అప్పీలు చేశాడు. ఆ తర్వాత అద్భుత బంతితో**




**రెండో వికెట్ దక్కింది. హ్యాట్రిక్ కోసం ప్రయత్నించా. కొత్త బ్యాటర్ బ్యాట్‌ను బంతి తాకుతూ స్లిప్‌లోకి వెళ్లింది. హ్యాట్రిక్ కొట్టేశానని భావించా. సెలబ్రేషన్స్ స్టార్ట్ చేస్తూ అప్పుడు రోహిత్ వైపు చూశా” అని అక్షర్ పటేల్ వివరించాడు. ఈ మ్యాచ్‌లో అక్షర్ పటేల్ 9 ఓవర్లలో 43 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు తీశాడు.**




### 11వేల క్లబ్‌లోకి రోహిత్

వన్డేల్లో భారత సారథి రోహిత్ శర్మ 11వేల క్లబ్‌లోకి చేరాడు. బంగ్లాదేశ్‌పై 41 పరుగులు చేసి పెవిలియన్‌కు చేరాడు. అయితే, 12 పరుగులు చేసినప్పుడే భారత్ తరఫున వన్డేల్లో 11వేలకుపైగా రన్స్ చేసిన నాలుగో బ్యాటర్‌గా నిలిచాడు. ఇప్పటి వరకు 261 ఇన్నింగ్స్‌ల్లో ఈ ఘనతను సాధించాడు. అతడి కంటే ముందు విరాట్ కోహ్లీ (222) మాత్రమే ఉన్నాడు. సచిన్ (276), గంగూలీ (288) కంటే రోహిత్ ముందున్నాడు.